క్లుప్తంగా...

శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా దేవేందర్



రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా దేవేందర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాస్‌ను బదిలీ చేయడంతో దేవేందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఉప్పర్‌పల్లిలోని స్టేషన్ ఆవరణలో ‘సాక్షి’తో మాట్లాడుతూ ప్రజలు ఎక్సైజ్ పోలీసులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. తమ ప్రాంతంలో మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయిస్తున్న వారి సమాచారాన్ని అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

బీజేపీ రాజేంద్రనగర్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి



దరఖాస్తును అందజేస్తున్న బీజేపీ నాయకుడు సోల్కర్‌రెడ్డి

రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించాలంటూ బీజేపీ నాయకుడు సోల్కర్‌రెడ్డి సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పర్‌పల్లిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎంసీఏ చదివిన తాను ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానన్నారు. 2009 నుంచి 2014 వరకు లోక్‌సత్తా పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానన్నారు. రాజకీయంలో 20 ఏళ్ల అనుభవం ఉందని వెల్లడించారు. బీజేపీకి ఆకర్షితులై పార్టీలో చేరానన్నారు. పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తు నియోజకవర్గంలో అందుబాటులో ఉన్నానన్నారు.

నేడు ‘మనూ’లో ‘అందరికీ విద్య’

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ (ఎస్‌ఈ అండ్‌టీ) ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ‘అందరికీ విద్య’ అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరుగుతుందని ఎస్‌ఈ అండ్ టీ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు.. మంగళవారం ఉదయం 11 గంటలకు క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం కూడా జరుగుతుందన్నారు.

25 మంది విద్యార్థులు ఎంపిక

రాయదుర్గం: మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధికారులు సోమవారం సమావేశమయ్యారు.సంస్థ అధికారులు వెంకట సత్యకృష్ణ, మహేష్‌లు వీసీకి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ యూసుఫ్‌ఖాన్ పర్యవేక్షణలో కంప్యూటర్ ఆధారిత హ్యాకర్ ర్యాంక్ టెస్ట్ అసెస్‌మెంట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఎంబీఏ, ఎంకామ్, బీకామ్ విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన వారిలో 25 మందిని ఎంపిక చేశారు.

ఘనంగా కాటమయ్యస్వామి బోనాలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో శ్రావణమాస బోనాల వేడుకలను కాటమయ్యస్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించారు. కాటమయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం నుంచి తొట్టెలు ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం మహిళలు బోనాలను సమర్పించారు. ఈ వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాటమయ్య యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోంది’



గోల్కొండ: రాష్ట్రంలో రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్. ఉషశ్రీ అన్నారు. సోమవారం ఆమె ఆధ్వర్యంలో కార్వాన్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులను కలుసుకొని కాంగ్రెస్ సాధించిన విజయాలతో పాటు తెలంగాణను కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పాలన వల్లే దేశం శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు బలియమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నిబేగం, షాకెల్లా, కృష్ణ, చంటి బాబు తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలోని 6, 7, 9, 10, 11వ డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ హాజరై రూ.3.22 కోట్లతో చేపడుతున్న డ్రైనేజీ, సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలతో ముందుకు వెళ్తున్నామన్నారు. గతంలో కురిసిన వర్షాలకు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నాయన్నారు. దీంతో బస్తీలు, కాలనీల్లో పర్యటించి సమస్యపై నివేధిక రూపొందించామన్నారు. ఈ మేరకు సమస్యలను ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన అధికారులతో చర్చించి నిధులను మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, పద్మవతిపాపయ్యయాదవ్, నిఖిలసంగారెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, ప్రశాంత్‌నాయక్, సాగర్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, జగదీష్, సీనియర్ నాయకులు పాండు, రాజిరెడ్డి, ఖాజా, రాజు, యూత్ ప్రెసిడెంట్ మల్లేష్, డీఈ యాదయ్య పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్‌లోని పద్మశ్రీహిల్స్‌లోని పోచమ్మ ఆలయ 2వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజల్లో కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వమించారు. పద్మశ్రీహిల్స్‌తో పాటు స్థానిక ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు



మంచిరేవులలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

మణికొండ: శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో 6వ తేదీ నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ప్రధాన అర్చకులు గూడా నర్సింహాచార్యులు తెలిపారు. 6న బుధవారం ఉదయం 9గంటలకు అగ్ని ప్రతిష్ఠ, హోవనం, పూర్ణాహుతి, 11 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తామన్నారు. 7న ఉదయం 9గంటలకు సహస్త్ర కలశాభిషేకం, 11 గంటలకు శోభారాణి బృందంచే కూచిపూడి నాట్య ప్రదర్శన, సాయంత్రం 6గంటలకు స్వామి వారి ఊంజల్ సేవ, రాత్రి 7.30 గంటలకు స్వామి వారి ఊరేగింపు, ఉట్టి కొట్టడంతో ఉత్సవాలు ముగుస్తాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బెస్ట్ డ్రైవర్‌కు సన్మానం



బెస్ట్ డ్రైవర్‌గా అవార్డు పొందిన రాజును సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్న రాజు బెస్ట్ డ్రైవర్‌గా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు వివిధ సంఘాల సభ్యులు సోమవారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. రాజు మాట్లాడుతూ.. యూనివర్సిటీ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అవార్డును అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహమాదిగ, మద్దిలేటి మాదిగ, జిల్లా నాయకులు మంగళారం రత్నంమాదిగ, నాన్నగారి రామచంద్రమాదిగ, యాదగిరిమాదిగ, కొండా లక్ష్మణ్ ఆర్టికల్చర్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ పోతురాజు యాదయ్యమాదిగ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా



శంషాబాద్: డిమాండ్లను నెరవేర్చాలంటూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టులు పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం ముందు సమస్యలను పెట్టినా పరిష్కరించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఈ ధర్నా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పదిహేనేళ్లుగా 2200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్ అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. అంగుర్ నాయక్, సంపత్, బుచ్చన్న, శ్రీనివాస్ పద్మ పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ల అందజేత



కిట్లను అందజేస్తున్న మహమ్మూద్ ఖాదర్

మైలార్‌దేవ్‌పల్లి: యువత క్రీడల్లో రాణించేందుకు ఉత్తమ శిక్షణ తీసుకోవాలని సోషల్ వర్కర్స్ ఫౌండేషన్ చైర్మన్, టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమూద్ ఖాదర్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని యువకులకు వాలీబాల్ కిట్లను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తున్నానన్నారు. యువత క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. తమకు నచ్చిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభకనబరుస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలి



ఆర్డీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న బుక్క వేణుగోపాల్

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బోగస్ ఓటర్ల ఏరివేతకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ కోరారు. సోమవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ మెంబర్ పోన్న వెంకటరమణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలన్నారు. అలాగే బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఫెబల్‌సిటీ అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు ఆరు వేలకుపైగా ఓట్లు ఉన్న ఫెబల్‌సిటీ వారికి అందుబాటులోనే పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ



తేనెటీగల పెంపకం శిక్షణలో తేనెను పరిశీలిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం తేనెటీగల పెంపకంపై శిక్షణ ప్రారంభించారు. అఖిల భారత సకశేరుకాల చీడల యాజమాన్యం ఆధ్వర్యంలో నేషనల్ బీ కీపింగ్, హనీ మిషన్‌లో భాగంగా ఆసక్తి గల రైతులకు, యువతకు ఈ శిక్షణ ఇస్తున్నారు. పరిశోధన సంచాలకుడు డాక్టర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయంలో తేనెటీగల పాత్ర వాటి సంరక్షణపై వివరించారు. ఈ తేనెటీగల పెంపకాన్ని వ్యాపార దృక్పథంతో చేసుకుంటే మంచి లాభాలు గడించవచ్చన్నారు. అధికారులతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను రైతులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పీవీ నర్సింహరావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొట్టడంతో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న ఓ కారు పిల్లర్ నెం:130 వద్ద ఆదివారం రాత్రి పక్కన ఆపారు. వెనుకాలే వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు గాయపడడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు.


లోతట్టు ప్రాంతాల్లో ఉపకమిషనర్ పర్యటన



పనులను పరిశీలిస్తున్న సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఉపకమిషనర్ రవికుమార్ సోమవారం ఉదయం పర్యటించారు. ప్రధానంగా వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై వరద నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక టీంలతో వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడామీ, ఆరాంఘర్ చౌరస్తా, రాజేంద్రనగర్, బుద్వేల్, శివరాంపల్లి ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై నిల్వ ఉండకుండా వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి ఉదయం నుంచి జీహెచ్‌ఎంసీ సిబ్బంది పారిశుద్ధ్య విభాగంతో పాటు మాన్‌సూన్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: భిక్షాటన చేసుకుంటూ జీవించే ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శివరాంపల్లి ఎన్‌పీఏ గేట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (52) పడి ఉన్నాడని స్థానికులు సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే ఆ వ్యక్తి రోడ్డుపై పడి చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. వివరాల కోసం స్థానికంగా వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదని, భిక్షటన చేసుకుంటూ రోడ్డుపై జీవించే వారడని స్థానికులు వెల్లడించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పండగలు వివిధ వర్గాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతాయన్నారు. మొహర్రం, వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ, దేవీ శరన్నవరాత్రి తదితర ఉత్సవాలు అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సాహంగా జరుపుకుంటారని ఆయన అన్నారు. స్థానిక ఉత్సవాల్లో సైతం శాంతిభద్రతలను కాపాడడానికి మైత్రి కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తున్నారని ఆయన అన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్సైలు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్టు ప్రారంభం



ప్రారంభోత్సవానికి హాజరైన సోమేష్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అత్తాపూర్: విద్యార్థులు ప్రతిభాపాటవాళ్లతో నూతన ఆవిష్కరణను సొంతం చేసుకుంటూ ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని తెలంగాణ రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ, ప్రస్తుత ముఖ్యమంత్రి సలహాదారులు సోమేష్‌కుమార్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. బండ్లగూడలోని మహవీర్ ఇంజినీరింగ్ గ్రూప్ కళాశాలలో ఫుడ్‌కోర్టు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులు సైతం ఉన్నత విద్యను అభ్యసించాలనే దివంగత సంరెడ్డి సుదర్శన్‌రెడ్డిలో బలమైన కోరిక ఉండేదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు, చేర్పులు చేయాల్సిన బాధ్యత కళాశాల యజమాన్యంపై ఉందన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా వేలాది మంది నిరుపేద విద్యార్థులకు కళాశాలలో చదువుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు కళాశాల చైర్మన్ సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. స్టార్టప్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామకృష్ణ రాజు, ఫుడ్‌కోర్టు డైరెక్టర్ నాగలక్ష్మి, కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధికి పంచాయతీలు కృషి చేయాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఏజీవర్సిటీ: సుస్థిర అభివృద్ధికిపంచాయతీలు కృషి చేయాలని పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సునీల్‌కుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్‌లో సోమవారం పంచాయతీరాజ్ వ్యవస్థపై రెండు రోజుల నేషనల్ స్టేక్‌హోల్డర్ కన్సల్టేటివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ లక్ష్యాల సాధన దిశగా ప్రగతి వేగాన్ని వేగవంతం చేసేందుకు మార్పుల ఉత్ప్రేకాలు కావాలని పంచాయతీలకు ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, నీతి ఆయోగ్, పంచాయతీరాజ్ సంస్థలు పంచాయతీల అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామ సభల అత్యవసర ఆవశ్యకత నిధుల సక్రమ వినియోగం పంచాయతీల సొంత మూల ఆదాయాలను పెంచడం మారుమూల ప్రాంత్రాల్లో డిజిటలీకరణపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెత్తను కార్మికులకే అందించేలా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఉపకమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఇంట్లోని చెత్తను చెత్త సేకరణ కార్మికులకే అందించేలా చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ వెల్లడించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య ఎస్‌ఎఫ్‌ఏలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీ ఎస్ డబ్ల్యూఎం రాజేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్‌ఏలు విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ప్రతిరోజూ ప్రతి ఇంటికీ వెళ్లి వంద శాతం చెత్తను తీసుకోవాలని సూచించారన్నారు. ఎవరైతే చెత్తను ఆటో రిక్షాలకు ఇవ్వరో వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం డీఈ శ్రీనివాసులు, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు, ఎస్ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

‘ఫస్ట్ రెస్పాండర్లు’ 43 మందికి శిక్షణ పూర్తి



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ‘ఫస్ట్ రెస్పాండర్ల’కు రెండు రోజుల శిక్షణ సోమవారం పూర్తైంది. హెచ్‌సీయూ, ఈఎంఆర్ఐ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో మొదటి విడతలో 43 మందికి శిక్షణ ఇచ్చారు. అభ్యాసకులకు మొదటిరోజు శిక్షణలో భాగంగా సాధారణ వైద్యం, గాయం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో నేర్పించారు. రెండవ రోజు టాస్కులు ఇచ్చారు. ఈఎంఆర్ఐలోని మాస్టర్ ట్రెనర్లు, ఇన్‌స్ట్రక్టర్లచే వీరికి ప్రత్యేక శిక్షణ అందించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ గీతా వేముగంటి శిక్షకులను అభినందించారు. శిక్షణలో ఈఎంఆర్ఐ-జీహెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ జీవిరమణ పర్యవేక్షణలో ప్రతినిధులు డాక్టర్లు రవీనా,జావిద్, సతీష్, శిక్షణ అందించారు.

చైన్ స్నాచర్ అరెస్ట్..


- 7 తులాల ఆభరణాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ సందీప్



చైన్ స్నాచింగ్ కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్ తదితరులు

గచ్చిబౌలి: జల్సాల కోసం చైన్ స్నాచింగ్ బాటపట్టిన యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని డీసీపీ సందీప్ తెలిపారు. సోమవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. వివేకానందనగర్, బోరబండకు చెందిన రెల్ల కున్నమ్మ(53) ఆగస్టు 28 సాయంత్రం 6.15 గంటల సమయంలో భర్తతో కలిసి పర్వత్‌నగర్ రోడ్డులో వాకింగ్ చేస్తోంది. వెనక నుంచి వచ్చిన ఓ యువకుడు మెడలోని మంగళసూత్రం లాక్కొని ఉడాయించాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు చిన్న కొర్పోల్, నెక్కొండ మండలం, వరంగల్‌కు చెందిన మనుగురు మహిపాల్(27)గా గుర్తించారు. 2014లో నగరానికి వలస వచ్చి తులసీనగర్, బోరబండలో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడటంతో కూలీ డబ్బులు సరిపోక చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించగా తానే స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఏప్రిల్ 13న అల్లాపూర్ పీఎస్ పరిధిలో సజ్జా సత్యవతి నడుచుకుంటూ వెళుతుండగా పుస్తెల తాడుతో ఉడాయించినట్లు ఒప్పుకున్నాడు. ఆ రెండు కేసుల్లో 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులను డీసీపీ అభినందించారు. వాకింగ్‌కు వెళ్లినప్పుడు నగలు వేసుకోవద్దని జాగ్రత్తగా ఉండాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, డీఐ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్‌కు ఆదరణ



నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పలు పార్టీల నేతలు

అబిడ్స్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రగతితో పలు పార్టీల నేతలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని గోషామమల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రభుత్వ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో నందకిశోర్ ఆధ్వర్యంలో చేశారు. నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సహకారంతో గోషామహల్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్‌దే విజయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, విష్ణువర్ధన్, జగదీష్, అనూప్, సాహిల్, అనిల్ జైస్వాల్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



గోల్కొండ: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం నానల్‌నగర్ డివిజన్ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్వాన్, గోల్కొండ, లంగర్‌హౌజ్ డివిజన్లకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా అనారోగ్యంగా ఉండి అవసరమైన శస్త్రచికిత్సలు చేసుకునే వారు సీఎంఆర్‌ఎఫ్ పథకానికి దరఖాస్తుతో పాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఆస్పత్రి కొటేషన్‌తో పాటు వైద్యుల ప్రిస్క్రిప్షన్‌ను కూడా జత చేయాలన్నారు. పేద, బడుగు వర్గాల ప్రజలకు మజ్లిస్ అండా ఎప్పుడూ ఉంటుందని ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి అవి మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.